13
నమస్తే తెలంగాణ
హైదరాబాద్
ఆదివారం 19 నవంబర్ 2023
www.ntnews.com

# చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి...
editpage@ntnews.com

# రామదాసు కీర్తనల్లో సామాజిక స్పృహ

**ఇప్పటికి నాలుగు శతాబ్దాల కిందట, సరిగ్గా లెక్క చెప్పాలంటే 422 ఏండ్ల కిందట 1620 ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో జన్మించిన కంచర్ల గోపన్న తెలుగు సాహిత్యంలో మొదటి వాగ్గేయకారుడిగా, భక్త రామదాసుగా చరిత్రలో నిలిచిపోయారు. ఆయన రచించిన దాశరథి శతకంతో సహా అనేక రచనలు నేటికీ అజరామరం. ఆబాలగోపాలాన్ని అలరిస్తున్న ఆయన కీర్తనలలో భక్తి రసంతో పాటు సామాజిక స్పృహ కూడా ఉన్నది. రామదాసు కీర్తనలు అనగానే కేవలం భక్తికి సంబంధించిన కీర్తనలే ఉంటాయని అనుకుంటాము. భక్తితో పాటు సమాజంలో, మానవ జీవితంలో పాటించాల్సిన ఉన్నత విలువల గురించి కూడా ఆయన కీర్తనలు రచించారు. ఆధ్యాత్మిక సామాజిక వాగ్గేయకారుడిగా కూడా ఆయనను అభివర్ణించవచ్చు. రామదాసు కీర్తనలలో చాలా పాపులరైన 'ఏ తీరుగ నను దయ చూచెదవో ఇనవంశోత్తమ రామా! నా తరమా భవ సాగరమీదగ నళిన దళేక్షణ రామా!',' పాహి రామప్రభో పాహి రామప్రభో', 'దాశరథీ కరుణాపయోనిధీ' లాంటి కీర్తనలు ఆబాలగోపాలాన్ని సంగీతంతో నిమిత్తం లేకుండా అలరించాయి. వాటికి తోడు ఆయన రాసిన బాగా ప్రాచుర్యం పొందిన చాలా కీర్తనలలో సామాజిక స్పృహ కనిపిస్తుంది. రామదాసు కీర్తనలలో కొత్త కోణాన్ని ఆవిష్కరించే వ్యాసం ఇది.**

### భక్తి సంగీతానికి ముగ్గురు రాజులు

*తెలుగు వాఙ్మయంలో భక్తి సంగీతానికి రాజులు ముగ్గురు. అందులో పోతరాజుగా పిలువబడే పోతన, గోపరాజుగా పిలువబడే భక్త రామదాసు, మూడవ రాజు త్యాగరాజుగా చెప్పుకోవచ్చు. పోతన, కంచర్ల గోపన్న, త్యాగయ్య వీరు ముగ్గురు భక్తి సంగీతానికి రారాజులు. త్యాగయ్య తల్లి రామదాసు కీర్తనలు ఆలపించేదట. చిన్నప్పటి నుంచే త్యాగరాజు తన తల్లి ద్వారా రామదాసు కీర్తనలు వినడం వల్ల త్యాగయ్య ప్రభావితమై భక్తి కీర్తనలు రాశారని చెప్తారు. అందుకే త్యాగయ్యకు భక్త రామదాసు మార్గదర్శి అని అంటారు. రామదాసు ప్రభావంతోనే త్యాగయ్య రచనలు చేశారనే విషయం త్యాగయ్య కీర్తనల ద్వారా మనకు తెలుస్తుంది.*

### మెరుగు మాయని మేలిమి ముత్యాలు-రామదాసు కీర్తనలు.

రామదాసు అంటే భద్రాచలం, భద్రాచలం అంటే రామదాసు. సంస్కృతంతో పాటు పారశీ, ఉర్దూ, తెలుగు, భాషలలో రామదాసుకు మంచి ప్రావీణ్యం ఉన్నది. తానీషా పరిపాలనలో మంత్రులుగా పని చేసిన రామదాసు మేనమామలైన అక్కన్న, మాదన్న సిఫారసుతో ఆయన పాల్వంచ పరగణాకు తాసిల్దార్‌గా నియమించబడ్డారు. భద్రాచలం కూడా పాల్వంచ పరగణాలో భాగమే. అక్కడి ప్రదేశాలు, సంఘటనలు తాను రాసిన కీర్తనల్లో ప్రతిబింబించే విధంగా రచనలు చేశారు. ఎప్పుడైనా తెలిసిన ప్రాంతాన్ని గురించి తెలిసిన వ్యక్తుల గురించి సాహిత్యం వస్తే మనం ఆసక్తిగా చదువుతాము. అందుకే ప్రజల భాషలో తన సాహిత్యాన్ని అందించారు. సాహిత్యం సామాన్య ప్రజలకు దగ్గరయ్యేలా ఉంటే అది ప్రజల నాలుకల మీద నాట్యమాడుతుంది. ఆబాలగోపాలాన్ని అలరిస్తుంది. అందుకని నాలుగు వందల సంవత్సరాలైనా కూడా రామదాసు సాహిత్యం ఆయన కీర్తనలు మెరుగు మాయని మంచి ముత్యాలు లాంటివి. ఆయన కీర్తనలు నేటికీ అజరామరం. రామదాసు కీర్తనలు ఒక రాగంలో పాడాలని ఏమీ లేదు. అందుకే బాల మురళీకృష్ణ ఒక పాటను ఖర హర ప్రియ రాగంలో పాడితే అదే కీర్తనను మరొకరు వేరే రాగంలో పాడారు.

### రామదాసు కీర్తనల లో సామాజిక సందేశం.

భజన సంప్రదాయ శైలికి ఆద్యుడు రామదాసు. అందుకే ఆయనను ప్రజాకవి అని కూడా అంటారు. మూఢ విశ్వాసాలను దునుమాడుతూ సామాజిక స్పృహ కలిగిన మంచి సాహిత్యం రాశారాయన.

> 'స్వార్థ చింతన కలిగి ఘోరమైన పనులు చేస్తూ బతికే బతుకు కూడా ఒక బతుకేనా' అని ఆయన ఒక కీర్తనలో అలాంటివారిని ఈసడించుకున్నారు.ఎదుటివారి పట్ల హింస చేయకుండా ఉండాలని, పరుల ధనము దోచకుండా ఉండాలని ఆయన తన కీర్తనల్లో ఉపదేశించారు. 'అతిథి వచ్చి అన్నమడిగినంత అన్నంబింత ఇచ్చిన చాలు' అంటూ ఆకలికి అన్నము, వేదనకు ఔషధము ఇవ్వాలని చెప్తారు. సమాజంలో మన శక్తికొలదీ పరులకు సహాయం చేయాలని ఎదుటి మనుషులకు ఎలాంటి హానీ చేయవద్దని ఉపదేశిస్తారు.

తెలిసీ తెలియకపోయినా ఎదుటివారికి ఎలాంటి పరిస్థితుల్లో నష్టం చేయకూడదని మరొక కీర్తనలో చెప్తూనే 'అతిథి వచ్చి అడిగిన అన్నమింత ఇచ్చిన చాలు క్రతువు చేయవలెనన్న కాంక్ష ఏల?' అంటూ ప్రశ్నిస్తాడు. ఉపవాసాలు కఠినమైన నియమాలు పాటించవలసిన అవసరం లేదని, అనవసర క్రతువులను చేయాల్సిన అవసరం లేనే లేదని, పైన చెప్పిన పనులు చేస్తే మోక్షం దొరుకుతుందని ఆయన తన కీర్తనల్లో సామాజిక స్పృహను వెల్లడించారు.

'నారాయణ అనరాదా నీ నాలుకపై ముల్లు నాటి ఉన్నదా' అనే కీర్తనలో సమాజంలో పనికిరాని గాలి వార్తలు, వదంతులు వ్యాపింపజేయకుండా ఉండాలని చెప్పారు. హరి భక్తితో మెలగాలని అనవసర విషయాల్లో జోక్యం చేసుకోవద్దని ఆయన ప్రజలకు చురకలంటించారు. గాలి వార్తలు ప్రసారం చేయకూడదని ఆయన చెప్పిన విషయం చూస్తుంటే నేటి సోషల్ మీడియాకు ఇది పూర్తిగా వర్తిస్తుందనిపిస్తుంది.




మరో కీర్తనలో రామదాసు 'లెస్స సంసారి అయ్యుండి' అనే పద ప్రయోగం చేస్తారు. అందులో ఆయన చెప్పిన నీతి ఏమిటంటే సంసారంలో ఉండే ఒడిదుడుకులకు తట్టుకొని నిలబడాలని దాన్ని ఎలా బ్యాలెన్స్ చేసుకోవాలనే సందేశాన్నిచ్చారు. సమాజాన్ని అర్థం చేసుకోవడానికి పాజిటివ్ దృక్పథాన్ని కలిగి ఉండాలని ఆ కీర్తనలో రామదాసు బోధిస్తారు.

'రామ రామ అనే నోట రవ్వంత సేపైనా' అనే కీర్తనలో ఉత్తములు ఈ శరీరం అశాశ్వతం అని తెలుసుకుంటారని అంటారు. అలాంటివారు జీవితాన్ని తెలుసుకొని జీవిస్తారని రామదాసు అంటారు. స్నేహం చేసిన వారికి ద్రోహం చేయకూడదని, స్నేహ ధర్మాన్ని కూడా ఈ కీర్తనలో వివరిస్తారు. నమ్మిన వారిని మోసం చేయవద్దని చెప్పే ప్రయత్నం చేస్తారు. అలా ఒకవేళ ఎవరైనా చేస్తే యమదూతలు వచ్చి వారిని శిక్షిస్తారని కర్మ సిద్ధాంతాన్ని ఉపదేశిస్తారు. భౌతికమైన ఈ శరీరాన్ని పోషించడానికి డబ్బు వెంట పడి అనవసరంగా జీవితాన్ని పాడు చేసుకోవద్దని ఉపదేశిస్తారు.

శ్రీరామ నామం మరువాం! మరువాం!సిద్ధమే యమునకు వెరువాం వెరువాం!అనే కీర్తనలో విష్ణు కథలు చెవుల విందాం! విందాం! వేరు కథలు మాకు మందం! మందం! రామదాసులు మాకు సారామ్! సారామ్! కామ దాసులు మాకు దూరం! దూరం! అంటూ ఇహ లోక సుఖాలను మాత్రమే చూసుకునే వారిని దూరం పెట్టమని ఈ కీర్తనలో చెబుతారు.నారాయణుని మేము నమ్మాం నమ్మాం.భద్ర గిరీశుని భద్రతతో మనం ఉందాం! ఉందాం!అంటూ ముగిస్తారు.

> అసమానతలు కలిగిన ఈ సమాజంలో అందరూ మంచివారో, అందరూ చెడ్డవారో ఉండరని రామదాసు వివరిస్తారు. మిశ్రమ సమాజంలో మంచివారికి దగ్గరగా చెడ్డవారికి దూరంగా ఉండాలని బోధిస్తారు. సమాజంలో ఉన్నటువంటి విభిన్న మనస్తత్వాల గురించి ఒక కీర్తనలో చెప్తారు. అంతిమంగా మనం ఎంచుకున్న లక్ష్యాన్ని మరిచిపోవద్దని ఈ కీర్తనలో ఆయన మార్గం చూపిస్తారు.

రామదాసు కీర్తనల్లో భావం, భాష ఒకదానితో ఒకటి పోటీపడుతూ సాగుతాయి. ఆయన వేదాంత తత్వం చెప్పేటప్పుడు 'పోయేటప్పుడు ఒక పూచిక పుల్ల కూడా వెంట రాదని' ఒక కీర్తనలో చెప్తాడు.

### పన్నుల వసూళ్లకు ఆధ్యాత్మిక మార్గాన్ని ఎంచుకున్న రామదాసు.

గ్రామాల్లో భజన మండలుల ఏర్పాటుతో పాటు, వివిధ కళా రూపాల ద్వారా ప్రజలను ఉత్తేజితులను చేసి ప్రభుత్వానికి చెల్లిం చాల్సిన పన్నులను వసూలు చేసిన చరిత్ర కూడా రామదాసుకు ఉన్న ది. తాను తాసిల్దార్‌గా ఉన్న గ్రామా ల్లో తిరిగి తన ఆధ్యాత్మిక భజనల ద్వారా పన్నుల చెల్లింపునకు ప్రజ లను మానసికంగా సమాయత్తం చేశారు. మనం చివరికి వెంట తీసుకుపోయేది ఏమీ లేదని, ప్రభుత్వ ధనాన్ని కొల్లగొట్టవద్దని ప్రజలను పన్నులు కట్టడానికి మోటివేట్ చేస్తారు. గ్రామాల్లో భజన మండళ్లను స్థాపించి వాటి ద్వారా సామాన్య ప్రజల్లో సైతం నైతిక విలువలను పెంచే ప్రయత్నం చేశారు. లోకో భిన్నరుచి అని అంటారు. మనం చేసే పనులు కొందరికి నచ్చవచ్చు, నచ్చకపోవచ్చు. అలాం టి వారితో స్థితప్రజ్ఞతతో వ్యవహరించి మంచి స్వీక రించమని, చెడును ఎలాంటి శషభిషలు లేకుండా తిరస్కరించమని మనల్ని కార్యోన్ముఖులను చేస్తారు.

రామదాసు తాను రాసిన మరొక కీర్తనలో మన తప్పులను ఎంచేవారు ఎప్పుడూ మనకు విరోధులు కారని చెప్తారు. మన లోపాలను ఎత్తి చూపు తున్నారంటే మనల్ని మనమే సరిచేసు కోవడానికి అవకాశం వారు ఇస్తున్నారని అర్థం చేసుకోవాలని అంటారు. వారి విమర్శల వల్ల మనం మన జీవితాన్ని సరి చేసుకునే అవకాశం మనకు కలుగుతుందని చెప్తారు. అందుకే రామదాసు కీర్తనల్లో భక్తి మాత్రమే లేదు భక్తి మార్గం దారిలోనే అంతస్సూత్రంగా సామాజిక స్పృహను కూడా అంతర్లీనంగా జోడించి ఆయా కీర్తనల్లో మనకు సామాజిక సందేశాన్ని ఇమిడ్చి తన కీర్తనలు రచించారు.

యద్భావం తద్భవతి అన్నారు పెద్దలు. మనం ఏ రకంగా భావిస్తామో అదే మనకు లభిస్తుంది. అలాగే రామదాసు కీర్తనల్లో భక్తిరసంతో పాటు సామాజిక అంశాలను కూడా మనం స్వీకరిస్తే నేటి తరానికి భక్త రామదాసు బోధనలు మరింత దగ్గరగా చేరవేయవచ్చు.



బండారు రామ్మోహనరావు
98660 74027

## నీ ధ్యాసలో...

నారింజ రంగు బొట్టెట్టుకుని,
కురుల కిరణాలను సవరించుకుంటూ
ప్రభాత సమయంలో ముస్తాబైన నింగిలా కనిపిస్తావు

నల్లమబ్బు మురిసిన మధ్యాహ్న తీరంలో,
పరధ్యానంగా నడుస్తున్నప్పుడు,
కడలిలా మారి అలల పెదాలతో ముద్దాడి పలకరిస్తావు..

గోధూళి వేళ,
సమూహాలన్నీ ఒంటరితనాన్ని మోస్తున్నప్పుడు,
ఒంటరినైన నాలో,
అనేక భావాల సమూహమై సంభాషిస్తావు...

కలలా వస్తావనుకున్న రాత్రి,
కునుకును వారించి, రెప్పలపై వాలి...
రెండో జాము చివర్లో, గతాన్ని నిమురుతూ,
జలపాతాల్ని ఒలికిస్తావు.



జాబేర్ పాషా
మస్కట్ (ఒమన్)
00968 78531638

## విత్తనం

సహన లేపనం పూసుకున్న
అంతుచిక్కని పురాతన మాతృక

అస్తిత్వం కోల్పోకుండా చిత్తు అనుకోలేని విత్తు
పరిమళభరిత భవిష్యత్తు తరాల పతాకానికి తొలిమెట్టు

నీటిస్పర్శతో ఆలింగనం కాబడి
విత్తుగా ఎత్తుకు ఎదిగి ఒదుగుతూ...
వేర్లను రెక్కలుగా చాచుతూ...
పొరలు పొరలుగా చీల్చుకుంటూ...
కొమ్మలు రెమ్మలుగా పెరుగుతూ ఉంటుంది

ఆకుపచ్చని చెట్టుగా అవని అంతా పరుచుకొని
ఔషధ గుణాలతో పువ్వులు ఫలాలుగా
ఇంటి అవసరాల కల్ప తరువులుగా

ఇంటిల్లి పాదికి డెకరేషన్‌లో మేటిగా
పెరట్లో తులసి మొక్కగా
ఆఖరి మజిలీలో దేహంపై పాడెగా కాల్చే కట్టెగా

చల్లనిరేయిలో..హాయిని ప్రసాదించి
అవిశ్రాంత పసిడి అన్నపూర్ణ దాతువు

విత్తనం వినీలాకాశముగా
వినయంతో విజయ శిఖరముగా
ప్రకృతిని సృష్టించిన ఆణిముత్య వనకణం



డాక్టర్ పగిడిపల్లి సురేందర్
80748 46063

# తొలి పద ప్రయోగ సూచిక 'బసవ పురాణం'

**రాజాస్థానాల్లో ఊరేగుతున్న కవిత్వాన్ని అట్టడుగు వర్గాల వాడలకు, వివిధ వృత్తుల వద్దకు తీసుకెళ్లి పట్టం గట్టాడు సోమన. అందుకే సోమన తొలి సామాజిక కవి. ద్విపదలో స్వతంత్ర రచనలు చేసిన ఆదికవి.**

> అచ్చమైన తెలంగాణ దేశికవి సోమన. తెలుగు, సంస్కృతం, కన్నడ భాషల్లో గ్రంథాలను వెలువరించారు. తెలుగులో శతకం, ఉదాహరణ, ద్విపద కావ్యం, రగడ, గద్య మొదలైన సాహిత్య ప్రక్రియలకు పురుడు పోశారు పాల్కుర్కి సోమనాథుడు.. జాను తెలుగుగా కీర్తిని తెచ్చిపెట్టారు.




సోమన రచనల్లో 'బసవ పురాణం', 'పండితారాధ్య చరిత్ర' ప్రఖ్యాతి చెందిన ద్విపదకావ్యాలు. 'బసవ పురాణం'లో బసవేశ్వరుని జీవిత చరిత్ర ప్రధానంగా ఉంటుంది. సందర్భానుసారంగా దాదాపు 75 మంది శివభక్తులు బెజ్జ మహా దేవి, గొడగూచి మొదలైన కథలను సరసంగా వర్ణించారు.

> 'బసవ పురాణం' ఏడు ఆశ్వాసాల కావ్యం. ఈ బసవ పురా ణానికి పద ప్రయోగ సూచికను తయారుచేశారు ఏడుగురు సంపాదకులు. దీని నిర్మాణంలో బూర్ల వెంకటేశ్వర్లు, డాక్టర్ తత్వాది ప్రమోద్‌కుమార్, డాక్టర్ పోగుల విశ్వప్రసాద్, డాక్టర్ కలువకుంట రామకృష్ణ, డాక్టర్ కొత్తిరెడ్డి మల్లారెడ్డి, డాక్టర్ మట్టా సంపత్‌కుమార్ తదితరులు ఏడు ఆశ్వాసాలను సూచికకు అనుగుణంగా తయారు చేశారు. డాక్టర్ నలిమెల భాస్కర్ మొత్తంగా ఈ పనికి సలహాలు సూచనలిస్తూ సాధ్య మైనంత వరకు ఏక సూత్రత లోపించకుండా పర్యవేక్షించారు. ఈ పుస్తకాన్ని 'కరీంనగర్ సాహితి' ప్రచురించింది.

**సూచికా నిర్మాణంలో అనుసరించిన పద్ధతులు, పరిమితులు :** పాల్కుర్కి సోమనాథుడు తన బసవ పురాణంలో ప్రయోగించిన సంస్కృత సమాసాలను యథాతథంగా చూపించారు. సోమన సంస్కృత సమాస కల్పనా చాతుర్యాన్ని ఉన్నది ఉన్నట్టు చూపించాలనేదే సంపాదకుల ఉద్దేశం. తెలుగు సమాసాలను సైతం యథారూపాల్లోనే చూపిస్తూ పరపదాలను మాత్రం ఆ పదాలు అకారాది క్రమంలో ఎక్కడ వస్తాయో అక్కడ సూచించారు. సామెతలు, జాతీయాలు, నుడి కారాలు, శబ్దపల్లవాల్లోని పదాలను విడివిడిగా చూపలేదు. విడదీస్తే అర్థస్ఫూర్తి కొర వడుతుందనేది సంపాదకుల భావన.

**తెలంగాణ పదాలు :** సోమన కాలంలో సంస్కృత భాషా ధిక్యత, గ్రాంథిక భాషా ప్రభావం ఎక్కువగా ఉండేది. ఐనా ప్రజల భాషకు పాల్కుర్కి తన గ్రంథాల్లో పెద్దపీట వేశాడు. జనం నోట్లో నానుతున్న పదాలను ఉన్నదున్నట్టుగా వాడటం సోమన నిర్భీతికి నిదర్శనం.

ఉదాహరణలు-అంగడి, అలుకు, ఈడ, పెండ, ఉగ్గులు, ఒల్ల, కసుపు, కుడుక, బంతి (పంక్తి), నక్కులు, మిండడు.

**తెలుగు సమాసాలు :** సోమనాథుడు అచ్చ తెలుగు పదాలతో చక్కని సమాసాలను ప్రయోగించాడు. కొన్ని సమాసాలు కొత్తగా అనిపిస్తాయి, కొన్ని ఇప్పటికీ వాడుకలో ఉన్నవి కూడా ఉన్నాయి. వాటిలో అచ్చ వెన్నెల, కాకి పడగలు, ఉచ్చు కోకలు, దొప్ప చెవులు, అరవిరి కంటన్, అట్ట చెప్పులున్. దోనె కడుపు దొప్పచెవులు అనే పదబంధం ఇప్పటికీ వ్యవహారంలో ఉన్నది.

**మిశ్రమ సమాసాలు :** సంస్కృత తెలుగు పదాలను కలిపిన సమాసాలను మిశ్రమ సమాసాలు లేదా వైరి సమాసాలు అంటారు. ఇలాంటి సమాసాలను నన్నయాదులు (జీవగఱ్ఱ, ప్రాణగొడ్డము) కూడా ప్రయోగించారు. అలాంటి వాటిని సోమన కూడా బసవపురాణంలో ప్రయోగించారు. తెలుగు సంస్కృత పదాల సమాసాలను కూడా ఉపయోగించారు.

రాగి కుండలము, మొద్దు పాదముల్, మంచు పుంజంబు, ముక్కంటి గణము, యమపాశులన్, దీపకం బంబులు, యష్టి కోలలు మొదలైనవి.

**సంస్కృత సమాసాలు:** ప్రాచీన కాలంలో సంస్కృత తెలుగు భాషల్లో పాండిత్యముంటేనే గౌరవం ఉండేది. ఆ రెండు భాషల సాహిత్యాల్లో వైదుష్యమున్న విద్వత్కవి సోమన. బసవ పురాణాన్ని శంకరాచార్యులనే కవి, 'బసవేశవిజయ'మనే పేరుతో సంస్కృతానువాదం చేశాడని డాక్టర్ జి.నాగయ్య తెలిపారు.

స్వేచ్ఛా విహీనకృత్యమున, హృదయాబ్జ మకరంద ధార, అంజలీకృత కరకంజుడు, తత్త్వ సౌఖ్యజలధి, శబ్దాలంకార ప్రతిభ, ధీర మహోదార శూర గంభీర సార గుణస్తోమ దీరేయుడు

**రెండు పాదాల సమాసాలు**

గురుభక్తి ఫలసార గుహ్యప్రసాద, వరసేవనా సుఖపరవశ లీల మరకత నీల నిర్మల పుష్యరాగ వర వజ్ర విద్రుమ వైఢూర్య ముఖ్య


సోమన ఈ కావ్యంలో హొన్న, హొన్నయ్య, హిరియ, వంటి కన్నడ పదాలను కూడా ప్రయోగించారు. పాల్కుర్కి బండి 'ఱ' మొదటి అక్షరంగా ఱంకు, ఱంపము, ఱాయి, ఱొమ్ము, ఱాల్ల వాన మొదలైన 26 పదాలను వాడినట్టు ఈ సూచిక ద్వారా తెలుస్తుంది.కొన్ని జంటపదాలను ప్రయోగించారు. నోములు గీములు, నంబియు గింబియు, కసిబిసి, కట్టె గిట్టె మొదలైనవి. ఒకటిరెండు సార్లు మొదలుకొని ఐదు వందల సార్లకు వాడిన పదాలున్నాయి. వందకంటే ఎక్కువ సార్లు ప్రయోగించిన పదాలు ఎల్లి, ఐన, తన, ఎల్లన్, అందు, ఏమి, ఐ అక్షరం, దీనిలో తలమున్కలు, మేలుబంతి, పిల్లిగడ్డంబు మొదలైన జాతీయలెన్నో ఉన్నాయి.

> సంపాదకులు ఇందులో పదాలను ఎలా విడదీశారో తెలుసుకునేందుకు ఒక పద్య పాదాన్ని ఉదాహరణగా చూడండి. వీళ్లు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురించిన బసవపురాణ గ్రంథాన్ని తీసుకొని పద్య పాదాలకు సంఖ్యలను వేశారు. బసవపురాణం తృతీయాశ్వాసం లోనిదీ పద్యపాదం.

**తల్లిగల్గిన నేల తల జడల్గట్టు**
**1 2 3 4 5 6**

తల్లి అనేపదం ఒకటినుంచి ఏడవ ఆశ్వాసంలో 879 పాద సంఖ్యవరకు 34 సార్లు వచ్చింది అట్లాగే మిగతావి. ఒకేరకమైన పదాలను సందర్భాన్ని శేషమ్యమో, క్రియో, అవ్యయమో సూచిస్తూ, అది ఎన్నిసార్లు వచ్చిందో కూడా తెలిపారు. కన్న (క్రియ), కన్న (విశేషం), కన్న (అవ్యయం), ఇది వీరి లోతైన పరిశీలనకు నిదర్శనం.

సంపాదకులు ఎంతో శ్రమకోర్చి 'పద ప్రయోగ సూచిక'ను తెచ్చారు. పాల్కుర్కి మీద అభిమానం, ఆరాధనే వీళ్లను ఈ పనికి పురిగొల్పింది. అంతేగాక ఆంధ్ర కవుల కొన్ని గ్రంథాలకు ఇది వరకే పద ప్రయోగ సూచికలు వచ్చాయి. తెలంగాణ ఆదికవి ద్విపద కావ్యానికి లేకపోవడం పెద్దలోటని భావించారు. ఆ లోటును పూడ్చటం కోసం సంస్థలు చేయాల్సిన పనిని, వీళ్లు భుజాని కెత్తుకొని, పూర్తి చేసి తెలంగాణ ఆత్మగౌరవ జెండాను ఎగుర వేశారు. తెలంగాణ నుంచి తెలంగాణ కావ్యంపై వచ్చిన మొదటి 'పద ప్రయోగ సూచిక' ఇదే.



ఎర్రోజు వెంకటేశ్వర్లు
94925 57037

## కన్నీళ్లింకిపోతున్నాయ్..!



నువ్వు భూగోళం అవతల వైపు
లక్ష్యాన్ని అలానే అంటిపెట్టుకుని ఉండు.

ఇక్కడ నిద్ర లేని రాత్రులు
తెల్లారిపోతున్నాయి.

గూడు విడిచిన పక్షి లా
నువ్వెళ్లిపోతే తిరిగొచ్చేవరకూ
దిగులు సంద్రాలు ఈదుతున్నాను.

టీవీల్లో రక్తమడుగుల్ని చూసి
యుద్ధ విధ్వంసాల్ని చూసి
చిగురుటాకుల్లా వణుకుతున్నాం.

సరిగా ఉన్నావా తిన్నావా
బతుకు భయంతో
గొంతు సవరించుకుంటున్నావా
గొంతు పెగలని మాటల్తో నువ్వు
చీకటి దృశ్యాల్ని వొంపేసావు.

ఊహకందని ప్రపంచంలో
తడబడుతూ నేను విలపిస్తున్నాను.

హద్దులు గీయటంతోనే
యుద్ధాలు వచ్చాయి.

పక్షి జీవితమే నయం
ఆంక్షలులేని దూరాలు పోతుంది.

సందె వేళ దీపాల్ని
మిణుగురు పురుగుల కాంతిని
నాలో నింపుకుని
గుప్పెడు గుండెల్లో
నిన్ను దాచుకుని
ఎదురు చూపులు
ఆకుల్లా రాలుతున్నాయ్.

రెండు దేశాల
యుద్ధాల మధ్య
మమతల మేఘాలు కరిగి
ఏడ్చి ఏడ్చి
కన్నీళ్లింకిపోతున్నాయ్.
గాలులు రువ్వుతున్నాయ్.

నువ్వు ఏ ఒడ్డుకు
చేర్చుతావో గానీ
దిగులు మేఘాలు దట్టంగా కమ్ముకున్నాయి.

దుఃఖం దిగులు చూపుల్లో
వేలాడుతోంది.



గవిడి శ్రీనివాస్
70192 78368

### కలం పిలుపు

#### వ్యాసాలకు ఆహ్వానం

'మాతృభాష తెలుగు-ఉనికి, కర్తవ్యాలు' అనే అంశంపైన ఆంధ్ర సారస్వత పరిషత్, ఆది త్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో జనవరి5,6,7తేదీల్లో ఏపీలోని రాజమండ్రిలో ప్రత్యేక సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మాతృభాషపై వ్యాస సంకలనం ముద్రించనున్నారు. దీనికోసం వ్యాసాలను ఆహ్వానిస్తున్నారు. రచనలను నవంబర్15లోగా aspprasad2k23@gmail.comకు పంపాలి. వివరాలకు 90007 34466లో సంప్రదించాలి. **- ఆంధ్రసారస్వత పరిషత్.**

#### దశమ వార్షికోత్సవం

బాలగోకులం బాలల సాహితీ సాంస్కృతిక సంస్థ దశమ వార్షికోత్సవం నవంబర్ 20న హైదరాబాద్ రవీంద్రభారతి సమావేశమందిరంలో జరుగుతుంది. ఈ సందర్భంగా 'తొమ్మిది చిన్నారి పక్షులు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. ఈ కార్యక్రమంలో మామిడి హరికృష్ణ, చొక్కాపు వెంకటరమణ, అయినంపూడి శ్రీలక్ష్మి, దాసరి వెంకటరమణ, ఆకెళ్ల వెంకటసుబ్బారావు, నీరజ తదితరులు పాల్గొంటారు. **- బాలగోకులం సంస్థ**